# మహాత్ముడికి ఘన నివాళి

- ఉమ్మడి జిల్లాలో జయంతి వేడుకలు
- ఆయాచోట్ల పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- కరీంనగర్‌లో గంగుల, పెద్దపల్లిలో కొప్పుల





మెట్‌పల్లి: మహాత్ముడి విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి డా. సంజయ్ కల్వకుంట్ల



పెద్దపల్లిటౌన్: ఐటీఐ కళాశాల మైదానంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే దాసరి

కరీంనగర్ నెట్‌వర్క్, అక్టోబర్ 2: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కరీంనగరంలోని కోతిరాంపూర్‌లోని గాంధీ విగ్రహానికి మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్దపల్లిలో జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల మైదానంలో మెగా రక్తదాన శిబిరం కార్యక్రమంలో గాంధీ చిత్రపటానికి మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పూల మాల వేసి నమస్కరించారు. ఇక తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జమ్మికుంట పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద విగ్రహానికి మండలి విప్, బీఆర్‌ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి నివాళులర్పించారు. మెట్‌పల్లి పట్టణంలోని ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ ఆవరణలో, తన క్యాంపు క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్ కల్వకుంట్ల పాల్గొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణిపేటలో గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్, గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మంథని మండలం అడవిసోమన్‌పల్లిలో గాంధీ చిత్రపటానికి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ పూలమాల వేసి నివాళులర్పించారు.



జగిత్యాల: పురాణిపేటలోని గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

# కరీంనగర్‌లో కృతిశెట్టి

- ది చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి రాక
- జ్యోతి ప్రజ్వలన చేసిన మంత్రి గంగుల
- పాల్గొన్న జబర్దస్త్ ఆర్టిస్టులు

విద్యానగర్, అక్టోబర్ 2: కరీంనగర్‌లో సువిశాలమైన పార్కింగ్, అతి తక్కువ ధరలతో లెక్కకుమించిన వస్త్ర వెరైటీలు, అధునాతన హంగులతో రూపొందించిన ది చెన్నై షాపింగ్‌మాల్‌ను మంత్రి గంగుల కమలాకర్, సినీ నటి కృతిశెట్టి సోమవారం ప్రారంభించారు. జబర్దస్త్ టీం సభ్యులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా కృతిశెట్టి మాట్లాడుతూ చెన్నై షాపింగ్ మాల్‌లో నాణ్యమైన దుస్తులు సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో ఉన్నాయని, ₹99కే చీర అమ్మడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల సందర్భంగా ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా, అన్నీ ఒకే దగ్గర దొరికేలా వస్త్రాలు లభించడం బాగుందన్నారు. నిర్వాహకులు మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 17 షోరూంలలో నాణ్యమైన వస్త్రాలు, ఆభరణాల విక్రయాల్లో ఎంతోమంది ప్రజలకు ది చెన్నై షాపింగ్ మాల్ చేరువైందని, 18వ షోరూంను ఉత్తర తెలంగాణకు కేంద్ర బిందువుగా ఉన్న కరీంనగర్‌లో ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. నిష్ణాతులైన డిజైనర్లతో రూపొందించిన అధునాతన డిజైన్లలో పట్టు వస్త్రాలను చేనేత కార్మికులు తమ సొంత మగ్గాలపై నిపుణుల పర్యవేక్షణలో నేశారని, అతి తక్కువ ధరలకే వీటిని ది చెన్నై షాపింగ్ మాల్‌లో అందించగలుగుతున్నామన్నారు. ఇక్కడ లభించే డిజైన్లు, కలర్ కాంబినేషన్లు ఆడ పడుచుల అందాన్ని మరింత ఇనుమడిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా కృతిశెట్టి షాపింగ్ మాల్‌లో సందడి చేసింది. జబర్దస్త్ టీంతో కలిసి డ్యాన్స్ చేసింది. కోర్టు రోడ్ జన సందోహంతో నిండిపోయింది. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి హరిశకర్, కార్పొరేటర్లు సరిళ్ల ప్రసాద్, మేచినేని అశోక్‌రావు, నిర్వాహకులు మర్రి వెంకట్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, మర్రి జన్నారెడ్డి, మర్రి మధుమతి పాల్గొన్నారు.



చెన్నై షాపింగ్‌మాల్, జ్యువెల్లరీ షాపును ప్రారంభిస్తున్న మంత్రి గంగుల కమలాకర్



చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభించి చీరను ప్రదర్శిస్తున్న సినీ నటి కృతిశెట్టి

## ధర్మపురి, కోటిలింగాలను టూరిస్ట్ స్పాట్‌గా మారుస్తాం



స్తంభంపల్లి శివారులో హరిత హోటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ వెంకటేశ్‌నేతకాని, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి శాఖ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్,

- మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, అక్టోబర్ 2: 'గోదావరి పరివాహకంలో కాళేశ్వర జలాలతో కళకళలాడుతున్న ధర్మపురి, కోటిలింగాల క్షేత్రాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తా. ముఖ్యమంత్రి కేసీఆర్ సాయంతో పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించి గొప్పగా తీర్చిదిద్దుతానని' మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. సోమవారం వెల్గటూర్ మండలం స్తంభంపల్లి బీసీ గురుకుల పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోటిలింగాలలో ఏర్పాటు చేయబోతున్న అగ్రికల్చర్ డిగ్రీ కళాశాల ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పర్యాటక అభివృద్ధి శాఖ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, ఎంపీ వెంకటేశ్‌తో కలిసి ₹3 కోట్లతో నిర్మించిన హరిత హోటల్, ₹1.33 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. తర్వాత ఎండపల్లి మండలం గుల్లకోటలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి ఈశ్వర్ మాట్లాడారు. వ్యవసాయాధారిత ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఇథనాల్ ఫ్యాక్టరీని మంజూరు చేయించానన్నారు. ప్రజలు వద్దని అన్నందున రద్దు చేసి, దాని స్థానంలో వ్యవసాయ డిగ్రీ కళాశాలను మంజూరు చేయించానని, మంగళవారం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. వచ్చే మూడు నెలల్లో అగ్రికల్చర్ డిగ్రీ తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. ధర్మపురి, గూడెం, కోటిలింగాలకు వచ్చే భక్తులు, పర్యాటకుల కోసం హరిత హోటల్‌ను ఏర్పాటు చేశామని, మరో రూ.2కోట్లతో స్తంభంపల్లి శివారులో సర్వే నంబర్ 1090లో బుద్ధ ప్రాజెక్టును ఏర్పాటు చేసి అక్కడ అంబేద్కర్, బుద్ధుడి విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపీ వెంకటేశ్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. పర్యాటక శాఖ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. ఇక్కడ ఎస్సీ, గిరిజన గురకులాల కార్యదర్శి నవీన్ నికోలస్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ కునమల్ల ల క్ష్మి, జడ్పీటీసీ బొడ్డు సుధారాణి, పాఠశాల ప్రిన్సిపాల్ జక్కని రాజేశం, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అన్నం పెట్టే పెద్దకొడుకు కేసీఆర్

- బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ ప్రగతి
- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



లబ్ధిదారుకు పింఛన్ గుర్తింపు కార్డును అందిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల, అక్టోబర్ 2: అన్నం పెట్టే పెద్ద కొడుకు సీఎం కేసీఆర్ అని, బీఆర్‌ఎస్‌ను మళ్లీ ఆశీర్వదిస్తేనే అనుకున్న పనులు జరుగుతాయని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. కోరుట్ల పట్టణంలోని పీబీ గార్డెన్, కావేరి గార్డెన్‌లో సోమవారం వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన లబ్ధిదారులకు పింఛన్ గుర్తింపు కార్డులను కోరుట్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణలో గడిచిన పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనను ప్రజలు మననం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్, తాగు, సాగు నీటి కష్టాలతో ఎన్నో బాధలు అనుభవించామని వాపోయారు. అలవికాని హామీలతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అక్కడ ట్యాక్స్‌ల పేరిట ప్రజల నుంచి పన్నుల వసూళ్లకు తెరలేపిందన్నారు. కరెంట్, తాగునీటి వసతి లేక కర్ణాటక వాసులు అష్టకష్టాలు పడుతున్నారని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితిని మనకు రావొద్దన్నారు. కోరుట్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి తెలంగాణలోనే నంబర్‌వన్‌గా నిలుపుతానని తెలిపారు. పింఛన్‌దారులకు రెట్టింపు పింఛన్లు అందించే ప్రకటన సీఎం కేసీఆర్ త్వరలోనే చేయనున్నట్లు తెలిపారు. కోరుట్ల రెవెన్యూ డివిజన్, వంద పడకల దవాఖాన, మద్దుల చెరువు మినీ ట్యాంక్‌బండ్ హామీలను నెరవేర్చినట్లు పేర్కొన్నారు. ఈనెల 6న మంత్రి హరీశ్‌రావు వంద పడకల దవాఖానను ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. కోరుట్లలోని లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు రాకుండా శాశ్వత పరిష్కారానికి ₹4 కోట్లతో అండర్ గ్రౌండ్ నాలా నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు. ఏడాదిలోగా పనులు పూర్తి చేసి వరద ముంపు నుంచి కాలనీలను రక్షిస్తామని హామీ ఇచ్చారు. కోరుట్ల పట్టణంలో గృహలక్ష్మి పథకం ద్వారా 448 మంది లబ్ధిదారులకు ₹3 లక్షల చొప్పున, సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయానికి ఎంపిక చేశామన్నారు. పట్టణ శివారు సంగెం రోడ్డులో ఉన్న 52 ఎకరాల ప్రభుత్వ స్థలంలో గూడు లేని పేదలకు 75 గజాల చొప్పున స్థలాన్ని కేటాయించి 900 మందికి ఇండ్లు కట్టుకునేందుకు ₹3 లక్షల సాయం అందించేందుకు ప్రణాళికలు తయారు చేశామని చెప్పారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు ఉచితంగా వ్యాక్సిన్లు, ఆక్సిజన్ సిలిండర్లు అందించిన తన తనయుడు డాక్టర్ సంజయ్ ప్రజలకు సుపరిచితుడేనన్నారు. సంజయ్ కోరుట్లలో ఐటీ కంపనీ స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పని చేస్తాడని తెలిపారు. తనపై చూపిన ఆత్మీయతను తన కుమారుడిపై చూపి కోరుట్ల ఎమ్మెల్యేగా దీవించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మున్సిపల్ అధ్యక్షురాలు అన్నం లావణ్య, కమిషనర్ రాజేశ్వర్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, ప్రధాన కార్యదర్శి గుడ్ల మనోహర్, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

### కేసీఆర్‌తోనే మార్పు సాధ్యం

సీఎం కేసీఆర్ ధర్మాత్ముడు. అందుకే తెలంగాణకు సకల శుభాలు కలుగుతున్నాయి. సకాలంలో వర్షాలు పడుతున్నాయి. దేశానికి రాష్ట్రం ధాన్యబండాగారంగా వెలుగుతున్నది. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు అరిగోస పడ్డారు. కేసీఆర్ పాలనలో అభివృద్ధి, సంక్షేమంలో దేశానికి ఆదర్శంగా నిలిచింది. కరోనా కష్ట కాలంలో ప్రభుత్వానికి రాబడి లేకున్నా, సంక్షేమ పథకాలు ఆపలేదు. పదేళ్ల కింది తెలంగాణ, ఇప్పటి తెలంగాణ అభివృద్ధిని ప్రజలు గమనించాలి. తెలంగాణలో మళ్లీ కేసీఆర్ రాకపోతే కరెంట్, తాగు నీటి కష్టాలు మొదలైతయి. వలస పాలకుల చేతిలో మళ్లీ తెలంగాణ ఆగమైతది. తెలంగాణ మార్పు సీఎం కేసీఆర్‌తోనే సాధ్యం. ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలి. మా నాన్నపై చూపిన ప్రేమ, ఆప్యాయతలను నాపై చూపి, మీలో ఒకడిగా చూసుకోవాలి. కోరుట్ల ఎమ్మెల్యేగా దీవించాలి.

**- డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, కోరుట్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి**